క్లుప్తంగా

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు, గ్రామస్తులు

సాలూరు: మండలంలోని మామిడిపల్లి జెడ్పీ హెచ్ పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, కృష్ణ, సుజాతలను స్థానిక నాయకులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ.. నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వహించినప్పుడు తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని చెప్పారు. సన్మానగ్రహీతలు మాట్లాడుతూ, మామిడిపల్లిలో పనిచేయడం ఎంతో తృప్తినిచ్చిందని చెప్పారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

వెంకటాపురంలో కల్వర్టు నిర్మాణం



కాలనీలో జరుగుతున్న కల్వర్టు పనులు

సీతానగరం: మండలంలోని వెంకటాపురం పంచాయతీ నీలకంఠాపురంలో సర్పంచ్ బి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాలనీలో శిథిలావస్థకు చేరిన కల్వర్టులను తొలగించి కొత్త కల్వర్టులను నిర్మిస్తున్నారు. ఈ మేరకు కల్వర్టు పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

నేడు గెడ్డలుప్పిలో జగనన్న సురక్ష గ్రామసభ

సీతానగరం: మండలంలోని గెడ్డలుప్పి గ్రామంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పర్యవేక్షణలో జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి, శనివారం గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.ఎల్.ఎన్ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. వారం రోజులుగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి, సేకరించిన ప్రజావసరాలపై చర్చించనున్నామన్నారు.

68 మందికి వైద్య పరీక్షలు



రోగులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైద్యాధికారి శ్రీకాంత్

పార్వతీపురంటౌన్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెంకంపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 68 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. గ్రామంలో నెలకు రెండు సార్లు నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిబిరానికి వచ్చిన రోగులతో పాటు ఇంటి వద్ద మంచానపడిన రోగుల ఆరోగ్యం కూడా తనిఖీ చేస్తున్నామని, అవసరమైన వారికి మందులు, వైద్య సలహాలు, సూచనలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సీహెచ్ఓలు, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘననివాళి



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాబ్జీ, తదితరులు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట కాలనీలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ తదితరులు కలిసి బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఎం.కృపారావు, పకీరు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల కోసం వినతి

సీతంపేట: డీఎస్సీ 2018లో పీఈటీలుగా ఉద్యోగం పొంది రెండు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న బీపీఈడీ అర్హత కలిగిన వారికి తక్షణమే స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌గా పదోన్నతులు కల్పించాలని వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నాయకులు గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావును కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

కౌలు రైతుకు సర్కారు అండ

- కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు
- రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందేలా సాగుదారు హక్కుచట్టం
- కౌలు రైతుల లబ్ధిపై ఈనాడు తప్పుడు కథనం

పార్వతీపురం మన్యం జిల్లాలో కౌలురైతులు, అందుతున్న సాయం ఇలా...	
మండలాలు	15
రైతు భరోసా కేంద్రాలు	306
2021-23 సంవత్సరాల్లో లబ్ధి	7,583
2023-24 సాగు పత్రాల లక్ష్యం	5,125
ఇప్పటివరకు అందజేసినవి	3,500



పాలకొండలో పొలం పనిలో నిమగ్నమైన రైతులు

పార్వతీపురం టౌన్:

గత టీడీపీ ప్రభుత్వ నిర్వాకంతో కౌలు రైతులకు గుర్తింపు ఉండేది కాదు. విపత్తుల సమయంలో ఎలాంటి సహాయం అందేది కాదు. రాయితీలు, రుణాలు మంజూరయ్యేవి కావు. పంటల సాగుపై ఆసక్తి సన్నగిల్లేది. ఆ పరిస్థితిలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కౌలురైతులకు అండగా పంట సాగుదారు హక్కుచట్టాన్ని 2019లో అందుబాటులోకి తెచ్చింది. కౌలురైతులకు సాగుహక్కు (సీసీఆర్‌సీ) పత్రాలను అందజేస్తోంది. వీటి ఆధారంగా రుణాలు, రాయితీలు, వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని వర్తింపజేస్తోంది. ప్రభుత్వ చర్యలతో కౌలురైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతుండడం, రైతులకు ప్రభుత్వంపై నమ్మకం కుదరడంతో పచ్చపత్రికకు ఈర్ష్యపుట్టింది. విషపు రాతలతో మభ్యపెట్టే యత్నం చేసింది. పాపం... కౌలు రైతులకు శాపం అంటూ తప్పుడు కథనాన్ని వండివార్చింది.

2019లోనే పంట సాగుదారు హక్కు చట్టం

2019 సంవత్సరంలోనే జగనన్న ప్రభుత్వం పంట సాగుదారు హక్కు చట్టం అందుబాటులోకి తీసుకువచ్చింది. గత నాలుగేళ్లగా ఏటా ఏప్రిల్ నుంచి ఆర్‌బీకేల ద్వారా గ్రామ సభలు ఏర్పాటుచేసి కౌలురైతులకు సీసీఆర్‌సీ (క్రాప్ కల్టివేటర్ రైట్స్)కార్డులు మంజూరు చేస్తోంది. ఈ కార్డులు పొందిన రైతులు బహుళ ప్రయోజనాలు పొందడంతో పాటు బ్యాంకు రుణాలు అందుకుంటున్నారు.



పొలంలో వెద జల్లుతున్న రైతు

ప్రయోజనాలు ఇవి..

సీసీఆర్‌సీ కార్డులు 11 నెలల కాలపరిమితిని కలిగి ఉంటాయి. ఈ పత్రాలను పొందిన (బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ) కౌలు రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల ప్రయోజనాలు వర్తిస్తాయి. ప్రకృతి విపత్తుల కారణంగా పంట నష్టం ఏర్పడితే ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుంది. బ్యాంకు రుణాలతో పాటు ఉచిత పంట బీమా, వైఎస్సార్ సున్నావడ్డీ, పంటకు కనీస మద్దతు ధర, రాయితీపై విత్తనాలు, వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం పొందే అవకాశం ఉంటుంది. ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడి రుణాలు పొందవచ్చు.

నిరంతర ప్రక్రియగా..



కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందించే ప్రక్రియ ప్రభుత్వ సూచనల మేరకు నిరంతరం జరుగుతుంది. క్షేత్రస్థాయిలో రైతుభరోసా కేంద్రాల పరిధిలోని ప్రతి గ్రామంలో భూ యజమానులు, కౌలు రైతులతో అవగాహన సభలు నిర్వహిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానికంగా గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారుల సహకారంతో లక్ష్యాలను చేరుకుంటున్నాం. 2023-24 సంవత్సరానికి ఇప్పటి వరకు 3,500 మంది కౌలురైతులకు సీసీఆర్‌సీ పత్రాలు అందజేశాం.

– రాబర్ట్ పాల్, జిల్లా వ్యవసాయశాఖాధికారి, పార్వతీపురం మన్యం

సాగు సాయం



రైతులకు అండగా నిలిచేందుకు డీసీసీబీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. సాధారణ, గుర్తింపు పొందిన కౌలు రైతులకు రుణం అందించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం. రైతులకు సాగు సాయం అందించేందుకు చర్యలు చేపట్టాం. అర్హత కలిగిన రైతులందరికీ రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టాం. ఎటువంటి పూచీకత్తులు లేకుండా రూ.1.60లక్షల రుణం మంజూరు చేస్తున్నాం. 2023-24 సంవత్సరానికి రూ. 1.414 కోట్ల రుణం అందించేలా చర్యలు చేపట్టాం.

– జి.ఎల్.ఎస్.మూర్తి, లీడ్ బ్యాంకు మేనేజర్, పార్వతీపురం మన్యం

జగనన్న సురక్షతో సంక్షేమ ఫలాలు

మక్కువ:

జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ, తహసీల్దార్ ఎ. సూర్యనారాయణ, ఈఓపీఆర్‌డీ దేవకుమార్ తెలిపారు. మండలంలోని తూరుమామిడి, కాశీపట్నం గ్రామ పంచాయతీలలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఎటువంటి రుసుం లేకుండా, అర్హులైన లబ్ధిదారులకు 11 రకాల ధ్రువపత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పోల ఉమామహేశ్వరి, ఎస్.చందరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి కృష్ణంనాయుడు, కోట్ల నారాయణరావు, కొల్లి సత్యనారాయణ, అల్లు తిరుపతిరావు, ఆర్ఐ స్వాతి, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



కాశీపట్నంలో లబ్ధిదారులకు ధ్రువపత్రం అందజేస్తున్న తహసీల్దార్ సూర్యనారాయణ

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జగన్‌మోహనరావు

పార్వతీపురం టౌన్: రోగుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి. జగన్‌మోహనరావు అన్నారు. డోకిశీల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఓపీ నిర్వహణ, ల్యాబ్, వ్యాక్సిన్ నిల్వలు, ప్రసూతి గదులను తనిఖీ చేశారు. ఓపీ రికార్డులో నమోదు చేసిన రోగుల వివరాలు, ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. అనంతరం రోగులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో రోగ నిర్ధారణ కచ్చితంగా చేపట్టి అవసరమైన మందులు అందజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు బి.ఐశ్వర్య, యోగేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్ జయ, సిబ్బంది పాల్గొన్నారు.



రోగుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఐఓ జగన్‌మోహనరావు

టూరిజం ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి

పార్వతీపురం: జిల్లాలో ఉన్న అన్ని హోటల్స్, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాల్స్, బ్యూటీపార్లర్లు, లాడ్జిలు, ట్రావెల్ ఏజెన్సీలు, జిమ్ సెంటర్ల వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు తప్పనిసరిగా ఏపీ టూరిజం ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని జిల్లా టూరిజం అధికారి ఎస్.నారాయణరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనికోసం రాష్ట్ర పర్యాటకశాఖ జీఓ 188 జారీ చేసిందని తెలిపారు. వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ట్రేడ్ సర్టిఫికెట్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధి, సతి పేరిట ప్రత్యేక సర్టిఫికెట్లు జారీ చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 6309942033 నంబర్లకు సంప్రదించవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజల వద్దకే పత్రాలు

బలిజిపేట: జగనన్న సురక్ష పథకం ద్వారా 11 సేవలకు చెందిన ధ్రువపత్రాలు నేరుగా లబ్ధిదారులకే చేరుతున్నాయని ఎంపీపీ నాగమణి తెలిపారు. మండలంలోని బలిజిపేట, పలగర సచివాలయాల పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. బలిజిపేటలో ఎంపీపీ నాగమణి, పలగరలో జెడ్పీటీసీ సభ్యుడు ఎ.రవికుమార్ మాట్లాడుతూ, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, సర్పంచ్‌లు రాఘలత, వై.గౌరమ్మ, మండల సచివాలయ కన్వీనర్ల సంఘ అధ్యక్షుడు జి.శ్రీరాములునాయుడు, బీఎస్ఎన్ మూర్తి, జాన్, జి.జగన్, జి.సత్యం నాయుడు, పి.నారాయణరావు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బలిజిపేటలో ధ్రువపత్రాలు చూపుతున్న లబ్ధిదారులు

నేడు వైఎస్సార్ విగ్రహావిష్కరణ

పార్వతీపురం టౌన్/ సీతానగరం:

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి(వైఎస్సార్) జయంతి సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో 10 అడుగుల ఆయన(వైఎస్సార్) విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. శుక్రవారం దీనికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించిన ఆయన పార్వతీపురం మన్యం జిల్లాలోనే అతిపెద్ద వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు.

విగ్రహావిష్కరణకు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరతో పాటు మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా విచ్చేస్తారని, మండల స్థాయి ప్రజాప్రతినిధులంతా హాజరై, కార్యక్రమం జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోరారు.



విగ్రహ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

రాజన్న ఆరోగ్యశ్రీతో ప్రాణభిక్ష



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమలు చేసిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నాకు ప్రాణభిక్ష పెట్టారు. నేను పుట్టుక నుంచే ఆరోగ్యంగా లేకపోవడంతో తల్లిదండ్రులు పలు ఆస్పత్రుల్లో తమకున్న స్తోమతతో వైద్యం చేయించారు. ఎప్పటికీ నయం కాకపోవడం, రూ.3 లక్షలు అవుతుందని చెప్పడంతో ఆర్థికస్తోమత లేక ఆశలు వదులుకున్నారు. అంతలో రాజన్న రాష్ట్ర ముఖ్యమంత్రి కాగానే విశాఖలోని సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వైద్యులు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్రచికిత్స చేసి ఆదుకున్నారు. ఇప్పుడు ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుకుంటూ ఆరోగ్యంగా ఉన్నాను. రాజన్న చేసిన ఉపకారం వల్ల ఆయన కుమారుడు జగనన్నకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం.

– ఈదుబిల్లి పావని, ఇంటర్మీడియట్ విద్యార్థిని.కృష్ణారాయపురం, సీతానగరం మండలం.

ముందస్తు చర్యలతో సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో విజృంభించే సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరితో కలసి పలు శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వైద్య సిబ్బంది ప్రజల్లో వ్యాధులపై మరింత అవగాహన కల్పించాలన్నారు. క్షేత్ర సిబ్బంది అంకితభావంతో గ్రామీణ ప్రజలకు విధానపరమైన సేవలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ శాఖలు వారి పరిధిలో రక్షిత పథకాలను ప్రతి 15 రోజులకు శుభ్రం చేయాలన్నారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్, పైపులైన్ల లీకులపై దృష్టి పెట్టాలన్నారు. మురుగు నీరు నిల్వల్లో వృద్ధి చెందే దోమల నివారణ, మలేరియా, డెంగీ, అతిసార వంటి రోగాలను అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి స్పష్టమైన సూచనలు చేశారు. సమావేశంలో వైద్యాధికారులు కె.చింజీవి, వి.కమల్‌నాథ్, డొంక త్రినాథులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సోమేశ్వరరావు

గొంతు వాపు వ్యాధిపై తస్మాత్..

- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- పశు వైద్యాధికారి లక్ష్మణరావు

గుమ్మలక్ష్మీపురం:

పశువుల్లో వచ్చే గొంతువాపు వ్యాధి విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. తొలకరి వర్షాలు పడినప్పుడు సహజంగానే పశువులకు అంటు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. వర్షాకాలం ప్రారంభంలో పశువులకు వచ్చే వ్యాధుల్లో ప్రధానమైనది గొంతువాపు వ్యాధి. పశువులు చనిపోయే ప్రమాదం కూడా ఉంది. ఈ నేపథ్యంలో వ్యాధి లక్షణాలు నివారణ చర్యలు పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గొరడ పశు వైద్యాధికారి పి.లక్ష్మణరావు వివరించారు.



ఆరుబయట మేత మేస్తున్న పశువులు

వ్యాధి ఇలా వస్తుంది.

గొంతు వ్యాధి ప్రాణాంతకమైనది. పాస్టురెల్లా మల్టోసిడా అనే బాక్టీరియా సూక్ష్మజీవి వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుంది. పల్లపు ప్రాంతాలు, వర్షపు నీరు నిలిచి ఉండే ప్రదేశాల్లో మేతకు వెళ్లే పశువులకు ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. బలహీనంగా ఉన్న పశువులకు త్వరగా సోకుంది. దీన్ని గురక వ్యాధి, లేక కణత వాపు వ్యాధి అని కూడా అంటారు.

వ్యాధి లక్షణాలు

పశువు ఆయాసపడుతూ శ్వాస పీలుస్తుంది. శ్వాస పీల్చేటప్పుడు గురక శబ్దం వినిపిస్తుంది. నాలుక బయటకు తీస్తూ శ్వాస తీస్తుంది. శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. వ్యాధి సోకిన పశువు గొంతు పైభాగాన, మెడ వాపు వస్తుంది. కళ్లు ఎర్రబడి నీరు కారుతూ ఉంటాయి. జ్వరం తీవ్రత 104 నుంచి 106 డిగ్రీలకు పెరిగి పశువు చనిపోతుంది. వ్యాధి సోకిన 24 గంటల్లోగా చికిత్స చేయించకుంటే పశువు చనిపోతుంది.

నివారణ ఇలా..

జూన్, జూలై నెలల్లో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వ్యాధి లక్షణాలు కనబడిన వెంటనే పశు వైద్యాధికారికి చూపించాలి. వ్యాధి సోకిన పశువులకు సల్ఫాడిమిడిన్ మందును నరం ద్వారా ఇవ్వాలి. ఐదు నెలల వయస్సు కలిగిన దూడలకు మొదటిసారి టీకా వేయించాలి. మరో 30 రోజులకు బూస్టర్ డోస్ వేయాలి. ఏటా ముందుగానే టీకా వేయిస్తే గొంతువాపు వ్యాధిని నిరోధించవచ్చు. వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరుచేయాలి. పాకలను, షెడ్లను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలి. ఈ వ్యాధితో పశువు చనిపోతే ఊరికి దూరంగా గొయ్యి తీసి, సున్నం వేసి పూడ్చి పెట్టాలి.

వరినాట్లు వేయడంలో మెలకువలు పాటించాలి



మాట్లాడుతున్న ఏఓ అవినాష్

సీతానగరం: వరినాట్లు వేయడంలో మెలకువలు పాటించాలని ఏఓ ఎస్.అవినాష్ సూచించారు. మండలంలోని చినబోగిల గ్రామ రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ కె.రాధ అధ్యక్షతన జరిగిన సాగుపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరినారు వేసినప్పటి నుంచి దమ్ము చేసి, వరి ఉభాలు వేసినంతవరకు వ్యవసాయ సిబ్బంది ఇచ్చిన సలహాలు, సూచనలు పాటించాలని, తద్వారా పంట దిగుబడి పెరుగుతుందన్నారు. నారు వేసినప్పుడు నుంచే పంట తెగుళ్లు, చీడపీడల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జి.బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీ

కురుపాం: సామాజిక తనిఖీలను ఆడిట్ సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని ఉపాధి హామీ అంబుడ్స్‌మన్ కె.సన్యాసిరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా కురుపాం మండలంలోని 23 పంచాయతీల్లో పంచాయతీరాజ్, ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ శాఖల ఆధ్వర్యంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులపై ఆడిట్ నిర్వహించేందుకు వచ్చిన ఆడిట్ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబుడ్స్‌మన్ సన్యాసిరాజు మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన పనులను పరిశీలించి పారదర్శకంగా నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకు మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన ప్రజలు ఆడిట్ బృందం సభ్యులకు సహకరించాలని సూచించారు. సమావేశంలో మండల ఇంజినీరింగ్ అధికారి నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, ఎంపీటీసీ టి.వి.ఎస్.స్వామియాజులు, మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, శెట్టి నాగేశ్వరరావు, ఉపాధి హామీ ఏపీఓ బావాజీ, ఆడిట్ ఎస్ఆర్‌పీ గోవిందరావు , ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆడిట్ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న అంబుడ్స్‌మన్ కె.సన్యాసిరాజు

దోమల నివారణ చర్యలు చేపట్టండి

భామిని: పంచాయతీలో అనారోగ్యాలకు కారణమైన దోమల నివారణకు చర్యలు చేపట్టాలని బత్తిలి, భామిని వైద్యాధికారులు కొండపల్లి రవీంద్ర, పసుపులేటి సోయల్ అన్నారు. ఎంపీడీఓ జి.చంద్రరావు అధ్యక్షతన కార్యదర్శులకు శుక్రవారం నిర్వహించిన పారిశుద్ధ్య సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతీ శుక్రవారం డ్రైడే విధిగా పాటించాలన్నారు. మురుగు నీరు నిలువ లేకుండా తరలింపు, నీటి నిలువల తొలగింపుపై చేపట్టాల్సిన చర్యలు వివరించారు. దోమల నివారణ మందుల పిచికారీ, ఫ్యాగింగ్ చేయించాలన్నారు. సబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు, ఈవోపీఆర్‌డీ జి.కృష్ణారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు తక్షణమే పూర్తి చేయాలి : పీవో

భామిని: ప్రభుత్వ భవన నిర్మాణాలు తక్షణమే పూర్తి చేసి ప్రారంభించాలని ఐటీడీఏ పీవో పి.కల్పనాకుమారి ఆదేశించారు. భామిని, బొడ్డగూడ, నల్లరాయిగూడ, బాలేరు ఆర్‌బీకేలను శుక్రవారం ఆమె పరిశీలించారు. పలు సూచనలు చేశారు. భామినిలో సుమారు రూ.8కోట్లతో నిర్మిస్తున్న గిరిజన సంక్షేమ గురుకుల భవనాలను ఆమె సందర్శించారు. వచ్చే నెలలోగా పనులు పూర్తి చేసి అందివ్వాలని ఈఈ సింహాచలాన్ని ఆదేశించారు. బాలేరులో 49 జగనన్న హౌసింగ్ లేఅవుట్ల సమస్య పరిష్కరించి పట్టాలిచ్చిన లబ్ధిదారులకు అందివ్వాలని హౌసింగ్ పీడీ తమ్మినేని రమేష్, డీటీ నిమ్మల శేఖరంను సూచించారు.

సమస్యలు సృష్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బత్తిలి ఎస్ఐ యతిరాజుల అమ్మనరావును ఆదేశించారు. వీఈవోను జియో ట్యాగింగ్ చేసి పంపేందుకు పలు సూచనలు చేశారు. భామినిలో 19 జగనన్న లేఅవుట్ల వద్ద తాగు నీరు, మౌలిక వసతులు కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సందీప్, పీఆర్ ఏఈ గౌరీశంకర్‌ను ఆదేశించారు. సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు మంజూరును పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో చంద్రరావు, ఇంజినీరింగ్ అధికారులు, లబ్ధిదారులు టున్నారు.